క్లుప్తంగా

శ్రీరామ నవమి ఉత్సవాలకు రాట ముహూర్తం



రాట ముహూర్తం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మండపేట: స్థానిక బురుగుంట చెరువు సమీపంలోని సీతారామ క్షేత్రం వద్ద సోమవారం శ్రీరామ నవమి వేడుకలకు శ్రీకారం చుట్టారు. ఆలయ నిర్వాహకులు మల్లిపూడి గనేశ్వర రావు, మల్లిపూడి వెంకటేశ్వరరావు (కొండయ్య) కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి శ్రీరామ నవమి ఉత్సవాలకు రాట ముహూర్తం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మెర్ల వెంకట్రావు, పెనుమర్తి బొబ్బిలి రాజు, ముత్యాల రామకృష్ణ, పసల కొండ తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడికి సత్కారం



వీరబ్రహ్మం మాస్టారును సత్కరిస్తున్న నాయకులు

మండపేట: రాష్ట్ర బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన మండపేటకు చెందిన ఉపాధ్యాయుడు గుత్తుల వీరబ్రహ్మంను సోమవారం ఘనంగా సత్కరించారు. స్థానిక శెట్టిబలిజ కల్యాణ మండపంలో భవన అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కొప్పిశెట్టి శ్రీను ఆధ్వర్యంలో సంఘ సభ్యులు ఆయనను శాలువా, పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు యాండ్ర ప్రభాకరావు, మట్టపర్తి గోవిందరాజు, పెంకే గంగాధర్, మేడిశెట్టి దుర్గారావు, పిల్లి శ్రీనివాస్, కోట వెంకటరావు, వాసంశెట్టి గాంధీ, సూరంపూడి సత్యప్రసాద్ వాసంశెట్టి వాసు, సూరంపూడి గనిరాజు తదితరులు పాల్గొనారు.

పోలీస్ స్టేషన్‌కు బారికేడ్ల బహూకరణ



బారికేడ్లను అందజేస్తున్న సందీప్‌రెడ్డి

రాయవరం: స్థానిక సాయితేజ విద్యానికేతన్ డైరెక్టరు కర్రి సందీప్‌రెడ్డి రాయవరం పోలీస్ స్టేషన్‌కు బారికేడ్లు బహూకరించారు. రూ.35 వేలు విలువైన బారికేడ్లను తయారు చేయించి సోమవారం ఎస్సై డి.సురేష్‌బాబుకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై సురేష్‌బాబు మాట్లాడుతూ రహదారి ప్రమాదాల నివారణకు బారికేడ్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. బారికేడ్లు అందజేసిన సందీప్ రెడ్డిని ఎస్సై సురేష్‌బాబు అభినందించారు. సందీప్‌రెడ్డి మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా భావించి బారికేడ్లను అందజేశానన్నారు. కార్యక్రమంలో స్థానిక నేత వుండవిల్లి రాంబాబు, పాఠశాల ఏవో పి.సుధాకర్, పోలీస్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత సహకార సంఘం మాజీ చైర్మన్ మృతి



వీరన్న (ఫైల్)

కపిలేశ్వరపురం: నేలటూరు చేనేత సహకార సంఘం మాజీ చైర్మన్ రుద్రాక్షుల వీరన్న సోమవారం ఆకస్మికంగా మృతిచెందారు. ఈయన 2008లో సహకార సంఘం చైర్మన్‌గా మూడేళ్ల పాటు సేవలందించారు. ఆయన మృతికి సర్పంచ్ కుక్కల వీరన్న, ఉప సర్పంచ్ శనక్కకాయల దొరబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు కొప్పిశెట్టి కిశోర్, మాజీ సర్పంచ్ రుద్రాక్షల వీరవెంకట శ్రీనివాసరావు, చల్లా చినబాబు సంతాపం వ్యక్తం చేశారు.

సారా రహిత గ్రామాలే లక్ష్యం

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని వెల్ల, వెలంపాలెం, చోడవరం గ్రామాల్లో నవోదయం 2.0లో భాగంగా సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు గ్రామ సభలు, అవగాహన ర్యాలీలు నిర్వహించారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అమర్‌బాబు సారా వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్రచార రథం ద్వారా ఆయా గ్రామాల్లో సారా వల్ల కలిగే అనర్థాలు, నష్టాల గురించి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు వీరబోయిన సూరిబాబు, టేకుమూడి సుజాత, నేదునూరి సంతోషమ్మ, రామచంద్రపురం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాస్, ఎస్సై టీవీ రామారెడ్డి, హెచ్‌సీ డేవిడ్ లివింగ్‌స్టన్, లక్ష్మణరావు, ఈసీలు శ్రీనివాసరావు, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుచ్చ.. ఆరోగ్యానికి రక్ష

- ఊపందుకున్న పుచ్చకాయల విక్రయాలు
- ఇతర రాష్ట్రాల్లోనూ విక్రయిస్తున్న కోరుమిల్లి వాసులు
- తమిళనాడు, నెల్లూరు నుంచి దిగుమతి
- సుమారు 200 కుటుంబాలకు ఆధారం



అమలాపురంలో పుచ్చకాయలను విక్రయిస్తున్న కోరుమిల్లి వ్యాపారి



అమలాపురంలో అమ్మకానికి సిద్ధం ఉన్న పుచ్చకాయలు, నర్సరీ పూలు

కపిలేశ్వరపురం: ప్రకృతిలో ఆరోగ్యానికి మేలు చేసే సహజసిద్ధమైన పండ్లు, కాయలు అనేకం ఉన్నాయి. వాటిలో ఆరోగ్య పోషకాలు మెండుగా ఉండటం ఒక ఎత్తయ్యితే అవి లభ్యమయ్యే ప్రదేశాలకు, వాటిని విక్రయించే శ్రామికులకు కొన్ని ప్రత్యేకత లుంటాయి. సీజనల్‌గా ఒక్కో ఫలానికి ఒక్కో ప్రాధాన్యత ఉంటుంది. ఇటీవల వేసవి తీవ్రత పెరిగిన నేపథ్యంలో పుచ్చకాయల విక్రయాలు ఊపందుకున్నాయి. తమిళనాడు, నెల్లూరు ప్రాంతాల నుంచి వాటిని దిగుమతి చేసుకుని విక్రయిస్తున్నారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోనే కాకుండా రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో సైతం పుచ్చపండ్లను విక్రయించేవారిలో కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లి గ్రామానికి చెందిన శ్రామికులు అత్యధికంగా ఉన్నారు. సుమారు 200 కుటుంబాలు పుచ్చకాయల విక్రయ వ్యాపారంపై ఆధారపడి జీవిస్తున్నాయి.

పుచ్చపండులో పోషకాలు ఇలా...

పుచ్చపండులో విలువైన పోషకాలు, శరీరానికి కావాల్సిన నీరు లభ్యమవుతాయి. తేలిగ్గా అరగడంతో పాటు జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. రోగ నిరోధక శక్తిని పెంచే బీటా కెరోటిన్, సి,ఇ,కె విటమిన్లు, ఫోలేట్, పొటాషియం, మెగ్నీషియం, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి.

రాష్ట్ర వ్యాప్తంగా విక్రయాల్లో కోరుమిల్లి వాసులు బీజీ

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో రహదారుల పక్కన పుచ్చకాయలు విక్రయిస్తున్నారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో రాయవరం, పసలపూడి, మాచవరం, మండపేట, ద్వారపూడి, కాజులూరు ప్రధాన రహదారుల్లో పెద్ద విక్రయదుకాణాలున్నాయి. పుచ్చకాయల వ్యాపారంలో కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లి గ్రామస్తులది ప్రత్యేకత. పెద్ద కోరుమిల్లికి చెందిన వారు హైదరాబాద్, ఒడిశా, కర్ణాటక, విజయవాడ, విశాఖపట్టణం తదితర ప్రాంతాల్లో నర్సరీలను నిర్వహిస్తున్నారు. అదే గ్రామ శివారు చిన్న కోరుమిల్లికి చెందిన వారు జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు కాకినాడ, యానాం, అమలాపురం, అనకాపల్లి, పెందుర్తి, కొత్తవలస, సాలూరు, విజయనగరం, ప్రాంతాల్లో పుచ్చకాయల దుకాణాలను నిర్వహిస్తున్నారు. గ్రామానికి చెందిన సుమారు 200 కుటుంబాలు పుచ్చకాయల వ్యాపారంపై ఆధారపడి జీవిస్తున్నాయి.

పలు రకాల పుచ్చకాయలు

పుచ్చకాయల్లో సుగర్ బేబీ, నాందారి, ఆర్క్‌మెన్ తదితర రకాలున్నాయి. మొత్తంగా నల్ల, తెల్ల రంగు కాయలుగా పిలుస్తారు. నల్లకాయలు అన్ని కాలాల్లోనూ పండుతాయి. విజయవాడ పరిసర ప్రాంతాల్లో పండే నల్లకాయల్లో తినదగిన ఎర్రటి భాగం తక్కువగా ఉంటుంది. ఈ రకం పంట పక్వానికి వచ్చినప్పుడు వర్షానికి తడిస్తే పంట దెబ్బతిని కాయ లోపలి భాగం పాడవుతుంది. అందుకే వీటిని ముక్కలు చేసి కాకుండా కాయలుగానే అమ్ముతారు. తెల్లకాయలు తమిళనాడు, నెల్లూరు ప్రాంతాల నుంచి తెస్తారు. ఇవి వేసవికాలంలోనే పండుతాయి. తినే ఎర్రటి భాగం ఎక్కువగా ఉంటుంది. ముక్కలు చేసి అమ్ముతుంటారు. నల్లకాయ సుమారు 3 కేజీలుండగా కేజీ రూ.20 చొప్పున అమ్ముతున్నారు. తెల్లకాయ సుమారు 15 కేజీలు వరకూ ఉంటుంది కేజీ రూ.30 చొప్పున అమ్ముతున్నారు.

సజావుగా వ్యాపారం



తమిళనాడు, నెల్లూరు, విజయవాడ ప్రాంతాల నుంచి పుచ్చకాయలను ఖరీదు చేసి తెస్తుంటాం. వేసవి సీజన్‌లో పుచ్చకాయలను ముక్కలుగా చేసి అమ్ముతాం. ఒక్కోసారి మంచి లాభాలు వస్తుండగా కొన్ని సార్లు నష్టాలను సైతం భరించాల్సి వస్తుంది. పది లోడుల్లో రెండు నుంచి మూడు లోడుల్లోని కాయలు దెబ్బతిని వస్తుంటాయి. వినియోగదారుల ఆదరణవల్ల ప్రస్తుతం వ్యాపారం సజావుగా సాగుతుంది.

– తుట్టుపు వీరబాబు, చినకోరుమిల్లి, కపిలేశ్వరపురం మండలం

ఆరోగ్యానికి మంచిది



పుచ్చపండు ఆరోగ్యానికి మంచిది. 91 శాతం నీటితో నిండిన 100 గ్రాముల పుచ్చ పండు శరీరానికి 46 కేలరీల శక్తిని అందిస్తుంది. 7.6 గ్రాముల పిండి పదార్థాలు, 26 మిల్లీ గ్రాముల విటమిన్ ఎ, 170 మిల్లీ గ్రాముల పొటాషియం, 12 మిల్లీ గ్రాముల విటమిన్ సి, 1 మిల్లీ గ్రామ్ బి6, 0.6 గ్రాముల ప్రొటీన్, 0.4 గ్రాముల ఫైబర్ ఉంటాయి. ప్రస్తుత వేసవిలో పుచ్చకాయలు తినడం ఆరోగ్యానికి మంచిది.

– డాక్టర్ కె.విజయదీపిక, అచ్యుతాపురం పీహెచ్‌సీ, కపిలేశ్వరపురం మండలం

పంటపొలాల పరిశీలన



శలపాకలో పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న అధికారులు

సాక్షి ఇంపాక్ట్

కాజులూరు: మండలంలోని శలపాక, గొల్లపాలెం, ఆర్యావటం, తుమ్మలపల్లిలంక తదితర గ్రామాలలో సాగు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న పంట పొలాలను సోమవారం అధికారుల బృందం పరిశీలించింది. శనివారం మండల గ్రామాలలో రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి ఇబ్బందులను వివరిస్తూ 'సాక్షి' పత్రికలో 'శివారుకు అందని సాగు నీరు' శీర్షికన కథనం ప్రచురితమయింది. దీనిపై స్పందిస్తూ సోమవారం మండల తహసీల్దార్ రవీంద్రనాథ్‌ఠాగూర్, జగన్నాథగిరి ఇరిగేషన్ ఏఈ ప్రదీప్, మండల వ్యవసాయాధికారి వి.అశోక్ తదితరులు పంటపొలాలను పరిశీలించారు. పలువురు రైతులు మాట్లాడుతూ మండల గ్రామాల్లో వరిపొలాలు తూర్పుడెల్టా శివారు భూముల్లో ఉన్నాయన్నారు. ఎగువ నుంచి వచ్చే కొద్దిపాటి నీరు కాలువ శివారు భూములకు చేరడం లేదన్నారు. మండల గ్రామాల్లో ప్రస్తుతం వరి పంట చిరుపొట్ట దశ నుంచి ఈనికదశలో ఉందని సాగునీరు లేక పొలాల్లో తడిఆరిపోతుండటంతో పంట ఈనిక జరగటం లేదని నీరులేక మొక్క గిడసబారిపోతుందన్నారు. దీనిపై తహసీల్దార్ రైతులతో మాట్లాడుతూ ఉన్నతాధికారులతో చర్చించి మండల గ్రామాలకు పూర్తి స్థాయిలో సాగు నీరందేందుకు కృషి చేస్తామన్నారు.

ప్రసాద్‌కు జాతీయ సాహిత్య పురస్కారం



పురస్కార గ్రహీత ప్రసాద్‌ను సత్కరిస్తున్న ప్రముఖులు

మండపేట: ద్వారపూడి జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న గండి స్వామి ప్రసాద్‌కు జాతీయ తెలుగు సాహిత్య పురస్కారం లభించింది. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, సృజనాత్మక, సంస్కృతి సమితి సౌజన్యంతో మహాకవి, కళాప్రపూర్ణ డాక్టర్ బోయి భీమన్న జీవితం, సాహిత్యం అనే అంశంపై తెలుగు అకాడమీ జాతీయ సాహిత్య నిర్వహించింది. ఈ సదస్సులో తాను సమర్పించిన పరిశోధన పత్రం ఉత్తమ పరిశోధనాంశంగా ఎంపికైనట్టు పురస్కార గ్రహీత స్వామి ప్రసాద్ సోమవారం తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగు ప్రొఫెసర్ డాక్టర్ తరపట్ల సత్యనారాయణ ప్రజాద్‌ను గజమాలతో సత్కరించి జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందించారు. అందజేశారు. తెలుగు సాహిత్యం వికాసానికి స్వామి ప్రసాద్ చేస్తున్న కృషిని అభినందించారు. పురస్కారం పొందిన ప్రసాద్‌కు ఉపాధ్యాయుడు సవితాల సుబ్రహ్మణ్యం, అభ్యుదయ రచయితల సంఘం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా శాఖ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ చల్లా రవికుమార్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ తదితరులు అభినందనలు తెలిపారు.

వ్యాపారులూ.. పారాహుషార్!

- ఇన్‌కంట్యాక్స్ రైడింగ్‌లపై బెదిరింపు ఫోన్లు
- నాలుగేళ్లుగా ఆర్థిక సంవత్సరం ముగింపులో..
- వ్యాపారులను ఆందోళనకు గురిచేస్తున్న వైనం
- ఫార్మాలిటీస్ ఇస్తే ఇబ్బంది ఉండదని భరోసా



ఇన్‌కమ్ ట్యాక్స్ రైడింగ్ అంటూ బెదిరిస్తున్న కేటుగాడు

రామచంద్రపురం రూరల్: ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. పలు వ్యాపార సంస్థల యజమానులకు ఫోన్లు చేసి టర్నోవర్ విషయాలు ప్రస్తావిస్తూ ఆదాయపన్ను అధికారులు మరో గంటలో మీ సంస్థకు రైడింగ్‌కు వస్తున్నారని ఆందోళనకు గురిచేస్తున్నారు. వారు వచ్చేలోపు వ్యాపారానికి సంబంధించిన అన్ని రికార్డులు సిద్ధం చేసుకోవాలని, వాటిలో ఏది చూపకపోయినా రూ.రెండు లక్షల నుంచి రూ.10 లక్షల వరకు జరిమానా విధిస్తారని హెచ్చరిస్తుండడంతో వ్యాపారులకు ముచ్చెమటలు పడుతున్నాయి. అంతటితో ఆగక రైడింగ్ ఆగాలంటే ఫార్మాలిటీస్ ఇవ్వాలని, సీనియర్ అసిస్టెంట్ మేడం (వల్లిపు లక్ష్మి, ఫోన్ పే నంబరు 81868 32087)కు ఫోన్ పే చేస్తే ఫేక్ కాల్‌గా పరిగణించి రైడింగ్ నిలిపివేస్తామని 99597 17887 (ట్రూ కాలర్‌లో పేరు కిశోర్ చౌదరి) నంబర్ నుంచి వచ్చే హెచ్చరికలకు కొందరు నష్టపోతుండగా కొందరు తీవ్రంగా భయపడిపోతున్నారు.

జీఎస్టీ వివరాలు లీక్!



వ్యాపార సంస్థల జీఎస్టీ వివరాలు లీక్ అవుతున్నాయని అనుమానం కలుగుతుంది. నాలుగేళ్లుగా ఏటా ఈ తరహా ఫోన్లు వస్తున్నాయి. టర్నోవర్‌లు చెప్పి మరీ ఫోన్ చేస్తున్నారంటే డాటా లీకవుతోందన్న అనుమానాలు ఉన్నాయి. గతంలో పోలీస్ కేసు కూడా పెట్టాము. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

– అరిగెల భీమశంకరరావు, అకౌంటెంట్, ద్రాక్షారామ

అవగాహనతోనే క్షయ నివారణ సాధ్యం

- ఘనంగా ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినం
- గ్రామాల్లో అవగాహన ర్యాలీలు



వెల్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది



పేకేరులో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, వైద్య సిబ్బంది

కపిలేశ్వరపురం: అవగాహనతోనే క్షయ వ్యాధి నివారణ సాధ్యమని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎస్‌ఎస్‌డీ రత్నకుమారి అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలన దినాన్ని పురస్కరించుకొని సోమవారం అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వ్యాధి నిర్మూలన అందరి బాధ్యత అంటూ నినాదాలు చేశారు. వైద్యాధికారి రత్నకుమారి మాట్లాడుతూ వ్యాధి కారణాలు, లక్షణాలు, నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. క్షయ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి క్రమ పద్ధతిలో చికిత్స, జాగ్రత్తలు తీసుకోకుండా జనంలో సంచరించడం ద్వారా సుమారు 15 మందికి వ్యాధిని వ్యాపింపజేస్తాడన్నారు. వ్యాధి నిర్మూలకు అత్యాధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉంటే ఆసుపత్రిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, హెచ్‌ఈ బి.రామారావు, ఎంపీహెచ్‌ఎస్ తాతపూడి మేరీ, ఎల్‌టీ ఆలీ, ఎంఎల్‌హెచ్‌పీ, వైద్య ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వాకతిప్పలో...

వాకతిప్ప పీహెచ్‌సీ వైద్యాధికారి చిట్టూరి రాకేష్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ బిషప్, టీబీ సూపర్‌వైజర్ రమణ, ఎంపీహెచ్‌ఎస్ కామేశ్వరరావు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ

మండపేట: ప్రతిఒక్కరి కృషితో క్షయవ్యాధిని పూర్తిగా నిర్మూలిద్దామని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుధారాణి అన్నారు. స్థానిక గుమ్మిలేరు రోడ్డులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ఎండీవో కార్యాలయం, గొల్లపుంత కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్లలో సోమవారం ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలన దినం నిర్వహించారు. డాక్టర్లు సుధారాణి, సతీష్, ప్రసన్న, భావన, రమ్య, భవాని ఆధ్వర్యంలో క్షయ నిర్మూలనపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ క్షయ అంటువ్యాధి అన్నారు. తీవ్ర జ్వరం, దగ్గు, బరువు తగ్గటం వంటివి ఈ వ్యాధి లక్షణాలు అన్నారు. రెండువారాల పాటు ఈ లక్షణాలతో బాధపడుతుంటే వారిని క్షయ అనుమానితులుగా గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలన్నారు. ర్యాలీ అనంతరం టీబీ ఓడిపోతుంది దేశం గెలుస్తుందని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ కేఎస్‌వీ రమణ, పీఎంపీ అసోసియేషన్ నాయకుడు కోన సత్యనారాయణ, మందపల్లి సంజీవరావు పాల్గొన్నారు.

కె.గంగవరం: క్షయ వ్యాధిని అరికట్టవలసిన బాధ్యత అందరిపైనా ఉందని పేకేరు పీహెచ్‌సీ వైద్యులు శ్రీలక్ష్మి, రేఖారాణి అన్నారు. మండలంలోని కుందూరు, దంగేరు, పేకేరు, పామర్రు పీహెచ్‌సీల వద్ద క్షయ వ్యాధి నివారణ దినం సందర్భంగా వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీలు నిర్వహించారు. పేకేరులో వైద్యులు మాట్లాడుతూ క్షయ వ్యాధి ఉన్న వారు క్రమం తప్పకుండా మందులు వాడితే నయమవుతుందన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే చికిత్స పూర్తయ్యే వరకు మందులు ఉచితంగా అందించడంతో పాటు పౌష్టికాహారం నిమిత్తం ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. ఎంపీహెచ్‌ఈఓ పీవీవీఎస్‌ఎన్ మూర్తి, వైద్య సిబ్బంది రాజశేఖర్, వి.మంగాదేవి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: క్షయ వ్యాధిని నిర్లక్ష్యం చేయకుండా తగిన వైద్యం చేయించుకుని దేశాన్ని క్షయ రహిత దేశంగా చేయడంలో ప్రజల భాగస్వామ్యం ఉండాలని వెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారి వీవీ లక్ష్మీప్రసన్న అన్నారు. గ్రామంలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. డాక్టర్లు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, ధూమపానం, మద్యం తాగడం మానుకోవాలన్నారు. డివిజనల్ సూపర్‌వైజర్ జి.కమల్‌శేషు మాట్లాడుతూ ప్రస్తుతం వెల్ల పీహెచ్‌సీ పరిధిలో 11 మంది, ద్రాక్షారామ పీహెచ్‌సీ పరిధిలో 13 మంది, రామచంద్రపురం అర్బన్ పరిధిలో 28 మంది క్షయ వ్యాధికి చికిత్స తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కె.శ్రీనివాస్, డి.రాజేశ్వరి, సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు



మండపేటలో దీక్ష చేస్తున్న మహిళలు

మండపేట: పట్టణంలోని సత్యశ్రీ, సప్తగిరి థియేటర్ల రోడ్డులో ఇళ్ల మధ్య మద్యం షాపు ఏర్పాటు చేయవద్దంటూ స్థానికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం కొనసాగాయి. జనసంచారం, నివాసాల మధ్య మద్యం షాపు పెట్ట వద్దంటూ వేలాది మంది మహిళలు, విద్యార్థులు సైతం ఆందోళన బాట పట్టినా అధికారులు పట్టించుకోవడం లేదు. కాగా సమస్య పరిష్కారమయ్యేంత వరకూ తాము దీక్షలు విరమించేది లేదని మహిళలు తేల్చి చెప్పారు.

మురళీకృష్ణ నియామకం పట్ల హర్షం

కపిలేశ్వరపురం: భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఏపీ విభాగం చైర్మన్‌గా కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన పారిశ్రామిక వేత్త గన్నమనేని శేష మురళీకృష్ణ నియామకం పట్ల గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. ఫ్లూమెంట్ గ్రిడ్ సంస్థ వ్యవస్థాపకులు, సీఈఓగా వ్యవహరిస్తున్న మురళీకృష్ణ కరోనా సమయంలో గ్రామంలోని సీహెచ్‌సీకి రూ.లక్షల వ్యయంతో ఆక్సిజన్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు.

టిడ్కో అపార్ట్‌మెంట్లలోకి మున్సిపల్ ఆఫీసు మార్పు

వచ్చే నెల ఒకటి నుంచి అక్కడే కార్యకలాపాలు

మండపేట: టిడ్కో అపార్ట్‌మెంట్ల అందజేతలో టిడ్కో, మున్సిపల్ అధికారులు నిర్లక్ష వైఖరి అవలంభిస్తున్నారని ఆగ్రహించిన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పురపాలన టిడ్కో ఫ్లాట్ల నుంచి అందించాలని ఆదేశించారు. టీడీపీ కార్యాలయంలో ఇరు శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. టిడ్కో పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఇంకను పనులు పూర్తి కావడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. 95 శాతం పూర్తి కాగా మిగిలిన 5 శాతం పనులు పూర్తి చేయడానికి ఇంతకాలం జాప్యం దేనికని ఆయన ప్రశ్నించారు. దీనిపై ఆయన మండిపడుతూ టిడ్కో ఫ్లాట్లు లబ్ధిదారులకు అప్పగించేంత వరకూ మున్సిపల్ పాలన అక్కడి నుంచే అందించాలని ఆదేశించారు. కార్యాలయాన్ని ఏప్రిల్ 1 నుంచి అక్కడకు షిఫ్ట్ చేస్తున్నట్టు ఆయన ప్రకటించారు. కాలనీలో 6128 అపార్ట్‌మెంట్లకు గాను 2565 మందికి ఫ్లాట్లు అప్పగించామన్నారు. 3563 మందికి ఫ్లాట్లు అందివ్వాల్సి ఉందన్నారు. 5 శాతం పనులు పూర్తి చేయడానికి అధికారులు మీన మేషాలు లెక్కిస్తున్నారన్నారు. టిడ్కో పనులు పూర్తయ్యేంత వరకూ కార్యాలయం టిడ్కోకు మార్చి పురసేవలు అక్కడి నుంచి అందివ్వాలని ఆయన ఆదేశించారు.

కోర్టుల ప్రాంగణంలో చలివేంద్రం ప్రారంభం



రామచంద్రపురంలో కక్షిదారులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న జిల్లా జడ్జి శంకరరావు

రామచంద్రపురం: పట్టణంలోని కోర్టుల ప్రాంగణంలో 13వ అదనపు జిల్లా, సెషెన్స్ జడ్జి ఎం.శంకర రావు సోమవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. రామచంద్రపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కోర్టుతో పాటు సీనియర్, జూనియర్, మెజిస్ట్రేట్ కోర్టులతో పాటు తహసీల్దార్ కార్యాలయం, సబ్ ట్రెజరీ ఆఫీసు, పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజలకు ఈ చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని జడ్జి పేర్కొంటూ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ప్రత్యేకంగా అభినందించారు. మొదటి రోజు సుమారు 500 మందికి పైగా జడ్జిల చేతుల మీదుగా మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.నాగేశ్వరరావు నాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పిల్లి మురళీమోహన్ వెంకటరమణ, వాడ్రేవు సాయిప్రసాద్, సంయుక్త కార్యదర్శి చిన్నం వీర్రెడ్డి, జూనియర్ల ప్రతినిధి పిల్లా పృథ్వీ, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

సంక్షేమంతోనే అభివృద్ధి



దుగ్గుదుర్రులో రెడ్డి గిరిబాబు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సూర్యప్రకాశ్ తదితరులు

కాజులూరు: ప్రభుత్వాలు అందించే సంక్షేమ ఫలాలు అట్టడుగు స్థాయిలోని పేదలకు సైతం సక్రమంగా అందినప్పుడే అభివృద్ధి సాధ్యమౌతుందని వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. కాజులూరు శివారు చాకిరేవుమెరకలో ఇటీవల మృతి చెందిన రెడ్డి గిరిబాబు, దుగ్గుదుర్రులో పోతురాజు బలరాం కుటుంబ సభ్యులను సోమవారం ఆయన పరామర్శించారు. అనంతరం గ్రామంలో ఆయన మాట్లాడుతూ కమీషన్లు లభించే రాజధాని నిర్మాణంపై తప్ప ప్రజాసంక్షేమంపై కూటమి నాయకులకు చిత్తశుద్ధి లోపించిందన్నారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసి స్వలాభం కోసమే నాయకులు పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ మాత భారతి, మండల పార్టీ అధ్యక్షుడు పిల్లి కృష్ణమూర్తి, పార్టీ మండల బీసీ సెల్ కన్వీనర్ చొల్లంగి వెంకటరమణ, పార్టీ నాయకులు యాళ్ళ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏడు గ్రామాల్లో రీ సర్వే

రాయవరం: మండలంలోని ఏడు గ్రామాల పరిధిలో ఆక్వా జోనేషన్ రీ సర్వే చేస్తామని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి రమణారావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని ఎంపిక చేసిన ఏడు గ్రామాల్లో స్థానిక కమిటీల ద్వారా ఆక్వా జోనేషన్ రీ సర్వే చేపట్టనున్నట్లు చెప్పారు. 2018, 2023లో రెండు సార్లు ఆక్వా జోన్ గెజిట్‌లను ప్రచురించారన్నారు. గతంలో ప్రచురించిన రెండు ఆక్వా జోన్ గెజిట్‌లో నమోదు కాని చెరువల సర్వే నంబర్లను, అలాగే వ్యవసాయానికి అనుకూలంగా లేని, ఆక్వా చెరువుల తవ్వకానికి అనుకూలంగా ఉన్న భూములను గ్రామ స్థాయి కమిటీల ద్వారా రీ సర్వే చేస్తారన్నారు. పూర్తి వివరాలను ఎనక్జర్–2 నమూనాల్లో పొందుపర్చినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 26న కూర్మాపురం, మాచవరం, వెంటూరు, 27న నదురుబాద, వెదురుపాక, వి.సావరం, సోమేశ్వరం పంచాయతీల వద్ద గ్రామ సభలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

ఆక్వా జోనేషన్ రీసర్వేకు గ్రామసభలు

మండపేట: గ్రామాల్లో మంగళవారం ఆక్వా జోనేషన్ రీసర్వే గ్రామ సభలు నిర్వహించనున్నట్టు మత్స్యశాఖ అధికారి విళ్ల రమణరావు సోమవారం తెలిపారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలోని తాపేశ్వరం, ఇప్పనపాడు, కేశవరం, మండపేట పట్టణంలోని 7, 9 సచివాలయాల పరిధిలో మంగళవారం గ్రామ స్థాయి కమిటీలతో సభలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గ్రామస్థాయి కమిటీల ద్వారా సాగు విస్తీర్ణం, రైతుల వివరాల జాబితాను తయారు చేసి డిస్ట్రిక్ లెవెల్ కమిటీకి నివేదిస్తామన్నారు.

రామలింగేశ్వరుని కల్యాణం

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామలో మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి ఆలయానికి ఉత్తర దిక్కున వెలసిన పర్వత వర్ధినీ సమేత సప్తకోటి రామలింగేశ్వరుని కల్యాణ వేడుక సోమవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన శేక్ దినేశ్‌కుమార్, సంగీత దంపతుల చేతుల మీదుగా దేవులపల్లి ఫణి రామకృష్ణ, దేవులపల్లి శ్రీరామ్‌ల శాస్త్రోక్తంగా నిర్వహించారు.